


**పడమటి** ఆకాశం ఎర్రబడింది. సూర్యునికోసమే ఎదురు చూస్తున్నది పడమటి కొండ. సూర్యుణ్ణి ఒక విషయం అడగాలని ఉంది దానికి.

కొండ కొమ్మున ఒక చిన్న గుడిసె ఉంది. అది కొత్తది. వెల రోజులకు ముందు అక్కడ ఆ గుడిసె లేదు.

సూర్యుడి బండి దగ్గరకు రాగానే, "కర్మసాక్షీ! నమస్కారం" అంది పడమటి కొండ.

"నమస్కారం, పర్వత రాజా! ఈనాటి విశేషాలు వింటావా?"

"ఈనాటి విశేషాలు అలా ఉండనీగానీ, నిన్నొక్క మాట అడగాలని ఉంది."

"ఏమిటది?"

"నా నెత్తి మీదున్న ఈ కొత్త గుడిసెను చూశావా?"

"అవును—చూస్తూనే ఉన్నాను. . ."

సూర్యుడు చూడనిదేముంది? ఆ గుడిసెను కట్టుకున్నవాడు ఒక సామాన్యుడు. స్థిరచరాస్తులు లేనివాడు. పొట్ట కూటికైనా చాలీచాలని సంపాదన వరుడు. ఊళ్ళో ఉండాలంటే అద్దె ఇవ్వాలి. అద్దె అంతస్తులవారీగా ఉంటుంది. ఉన్నత కుటుంబీకులకు తగిన ఇంటికి ఆరేడు వందలు. మధ్య తరగతి ఇంటికి దాదాపు రెండు వందలు. అట్టడుగు తరగతి కొంపలో ఉండాలన్నా ఏభై! ఏభై రూపాయలు అద్దె ఇస్తే, పొట్ట గడవదు. పోనీ, ఊరి బయట ఎక్కడైనా చిన్న పాక వేసుకుందామంటే ఖాళీ జాగాలేమో ఉన్నాయిగానీ, ఇది మాది, అది మాది అంటారు ఉన్నవాళ్ళు. ఎక్కడా బెత్తెడు జాగా లేదు. పోనీ, కొండవార ఇల్లు కట్టుకుందామంటే, కొండవారంతా దున్ని వేరు శనగ పైరు వేశారు. వాటి చుట్టూ రాళ్ళ గట్లు, కంచెలు. పెద్దపెద్ద రాతి గుండ్లను మాత్రం వదిలేశారు. రాతి గుండుపైన ఇళ్ళు కట్టుకోవడం సాధ్యమా?. . .ఆఖరికి ఒక చోటు కనిపించింది ఆ సామాన్యుడికి. కొండ కొన కొమ్మున! అతడి అదృష్టం బాగుంది కనక, ఆ నేలంతా ఒకే శిలామయంగా ఉంది. లేకపోతే అక్కడ కూడా దున్ని వేరు శెనగలో, పులవలో చల్లేసి ఉండేవాళ్ళు... వాళ్ళకైదు వందలు అప్పుచేసి అక్కడొక చిన్న గుడిసె కట్టుకున్నాడు సామాన్యుడు. సంసారాన్ని సంతోషంగా అందులోకి తరలించాడు. నేలంతా ఒకే రాయి కాబట్టి ఆ గుడిసెకు పునాదులు లేవు. ఉన్నది కొండమీదనేగానీ, ప్రతిదానికీ వాళ్ళు ఊళ్ళోకి వెళ్ళాల్సిందే! ఉద్యోగం చేస్తున్నది ఊళ్ళో! ఉప్పు కావాలన్నా, పప్పు కావాలన్నా ఊళ్ళోకి వెళ్ళాలి! పిల్లలు చదువుకుంటున్న స్కూలు కూడా ఊళ్ళోనే ఉంది. ఊళ్ళోకి వెళ్ళిరావడం కాదుగానీ, కొండ ఎక్కి దిగడమే మహాకష్టం. సాయంకాలం ఉద్యోగం నుండి తిరిగొచ్చిన సామాన్యుడు కొండెక్కి గుడిసెలో కూలబడ్డాడంటే, మళ్ళీ పైకి లేవడు. కొండ ఎక్కి దిగలేకుండా, పిల్లలు స్కూలుకు వెళ్ళడం కూడా మానేశారు.

అప్పుడే కొండ దిగువ దూరంగా పొలాల మధ్యనున్న పంపు బావిలో నీటి కడవ నింపి చంకన బెట్టుకుని ఆ ఇల్లాలు కొండెక్కి వస్తూ ఉంది. ఉద్యోగం నుంచి తిరిగొచ్చిన ఆమె మొగుడు ఆమె వెనక కొండ దిగువ నిలబడి దిగులుగా పైకి చూస్తున్నాడు.

సూర్యుడు పడమటి కొండతో అన్నాడు—"రాతి నేల మీద ఈ మట్టి గోడలు ఆగవు. వర్షం వస్తే కూలిపోతాయి."

"ఈ మనిషి ఇక్కడే ఎందుకు కట్టుకున్నాడు గుడిసె? ఇంకెక్కడ చోటు లేదా?" అని అడిగింది పడమటి కొండ.

సూర్యుడు ఎర్రగా నవ్వాడు. "ఎందుకు లేదూ? ఇంత విశాలమైన భూమి మీద అయిదు సెంట్ల నేలకా కరువు? భారతీయులందరూ తలొక ఇల్లు కట్టుకోవడానికి అనువైనన్ని చోట్లున్నాయి ఈ దేశంలో. అయితే స్థలం మాత్రం దొరకదు."

"ఎందుకు?"

"చాలా భూములు కలిగినవాళ్ళ స్వాధీనంలో ఉన్నాయి. అవి వాళ్ళ ఆస్తులుగా మారాయి. ఇంకా చాలా భూములు పోరంబోకులుగానే ఉన్నాయి, గ్రామాల చుట్టూ! వాటికి పట్టాలు లేవు. అయితే, వాటి చుట్టూ రాతి గట్లుంటాయి. తెలివైనవాళ్ళూ, అత్యాశాపరులు కొందరు ముప్పై నలభై ఏళ్ళ కిందటే వాటిని ఆక్రమించుకున్నారు. అవి సాగులో మాత్రం ఉండవు, చిట్టడివిలా చెట్లు మొలిచి ఉంటాయి. ఇది మాదీ అంటారు వాళ్ళు. ఇండ్లు లేని దరిద్రులెందరో అలో లక్ష్మణా అంటుంటే, ఈ ఆదనపు భూములు మాత్రం వీళ్ళ స్వాధీనంలో ఉంటున్నాయి. సామాన్యుడు కొండ కొమ్మున ఇళ్ళు కట్టుకోకుండా, ఇంకెక్కడ కట్టుకుంటాడు?"

"ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకుంటే ఇంటి జాగా దొరకదా?"

"ప్రభుత్వం ఆ దరఖాస్తును గ్రామాధికారులకు పంపుతుంది. వాళ్ళు భూములు లేవంటారు. దరఖాస్తు బుట్ట దాఖలవుతుంది."

పడమటికొండ కోపంతో పొంగిపోయింది. "ఇదిగో, ఎగురుతున్నా!" అంది.

"ఎక్కడికి?" అన్నాడు సూర్యుడు.

"వెళ్ళి, పోరంబోకు భూముల మీద పడతాను."

"నీకెందుకా శ్రమ? అందుకు కలెక్టర్లున్నారు. తాసీల్దారులున్నారు. గ్రామాధికారులున్నారు. కందకు లేని దురద కత్తిపీటకెందుకు?" అంటూ సూర్యుడు పడమటి కొండ చాటుకు వెళ్ళిపోయాడు.

నిస్సహాయత్వంతో ఆవలించింది పడమటి కొండ.

**—కలువకొలను సదానంద**